సాక్షి జగిత్యాల

సోమవారం । 4 । డిసెంబర్ । 2023



రాజన్నకు పోటెత్తిన భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో చన్నీటి స్నానాలు చేసి కార్తీకదీపాలు వెలిగించారు.



బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

జగిత్యాల: జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల నుంచి డాక్టర్ సంజయ్‌కుమార్, కల్వకుంట్ల సంజయ్ గెలవడంతో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

12లో▸

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరిగే అవకాశం ఉంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

శ్రీకాంతాచారి వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ధర్మపురి: తెలంగాణ సాధనలో అమరుడైన శ్రీకాంతాచారి 14వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నంది విగ్రహం వద్ద విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు.

సామూహిక విష్ణు చరిత్ర పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

జగిత్యాలటౌన్: కార్తీకమాసం సందర్భంగా జిల్లాకేంద్రంలోని చింతకుంట చెరువు సమీపంలోని ధనలక్ష్మీ సహిత శ్రీధన్వంతరి ఆలయంలో సామూహిక శ్రీవిష్ణుచరిత్ర పారాయణ సప్తాహం నిర్వహించారు. ఆదివారం ఉదయం ప్రత్యేక అలంకరణ అనంతరం విశేష పూజలు చేసి పారాయణం ప్రారంభించారు. ఆలయ అర్చకులు చిలుకముక్కు నాగరాజుశర్మ మాట్లాడుతూ పారాయణంతో శనిగ్రహ దోషాలు తొలగి ఆయురారోగ్య, ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రాజన్న, పాల్తెపు శంకర్, గట్టు రాజేందర్, తవుటు రాంచంద్రం తదితరులు ఉన్నారు.

హస్తం హవా

ఉమ్మడి జిల్లాలో 8 కాంగ్రెస్.. 5 బీఆర్ఎస్ కైవసం

- జగిత్యాల, కోరుట్లలో కారుదే విజయం
- 2004 ఫలితాలు పునరావృతం
- 5 స్థానాలకే బీఆర్ఎస్ పరిమితం
- జగిత్యాలలో తీవ్ర పోటీ ఇచ్చిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- ఎంపీలు ధర్మపురి అరవింద్, బండి సంజయ్ పరాజయం
- 19 ఏళ్లలో తొలిసారి ఓడిన ఈటల రాజేందర్
- రికార్డులు కోల్పోయిన కొప్పుల ఈశ్వర్, రాజేందర్



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసెంబ్లీ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఊపిరిపోశాయి. 20 ఏళ్లలో ఏనాడూ చూడని స్పష్టమైన సీట్లు రావడం గమనార్హం. 2004లో వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో టీఆర్ఎస్-సీపీఐ పొత్తులతో కాంగ్రెస్ కూటమి 10 సీట్లు(కాంగ్రెస్ 5, టీఆర్ఎస్ 4, సీపీఐ 1) సాధించింది. ఇప్పుడు 8 స్థానాల్లో విజయకేతనం ఎగరేసి కాంగ్రెస్-సీపీఐ కూటమి సత్తాచాటుకుంది. పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలను గెలుచుకుని క్లీన్‌స్వీప్ చేసింది. పొరుగునే ఉన్న ధర్మపురి, వేములవాడ, చొప్పదండి, మానకొండూరు, హుస్నాబాద్‌నూ కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంది. 2018 ఎన్నికల్లో 12 స్థానాలు గెలిచిన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల, కరీంనగర్, హుజూరాబాద్‌తో కలిపి ఐదో స్థానాలకు పరిమితమైంది. ఇక హుజూరాబాద్, కరీంనగర్, కోరుట్లలో బీజేపీ పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి.

బండి.. గంగుల నువ్వా-నేనా..

కరీంనగర్‌లో విజయం చివరి వరకూ దోబూచులాడింది. చివరి రౌండ్ వరకు సాగిన ఉత్కంఠ పోరులో తొలుత స్వల్ప ఓట్లతో గంగుల కమలాకర్ విజయం సాధించారు. దీనిపై బండి సంజయ్ అభ్యంతరం తెలుపుతూ కౌంటింగ్ కేంద్రానికొచ్చారు. పోలింగ్ బూత్ 43,289లో ఓట్ల లెక్కింపు చేపట్టలేదని ఆరోపించారు. సంజయ్ వినతిని పరిగణనలోకి తీసుకుని రేకుర్తిలోని లయోల బీఈడీ కాలేజీ రూమ్‌నంబర్ 3లోని 594 ఓట్లు, రాంపూర్‌లోని విద్యార్థి హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లలోని 697 ఓట్లను లెక్కించారు. చివరికి 3,169 ఓట్ల మెజార్టీతో గంగుల విజయం సాధించడంతో ఉత్కంఠకు తెరపడింది.

- మానకొండూరు నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ విజయం సాధించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే రసమయిపై ఏ దశలోనూ వెనకబడలేదు.
- చొప్పదండి- మేడిపల్లి సత్యం కూడా ప్రతీ రౌండ్‌లోనూ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై ఆధిపత్యం చూపించారు.
- హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి తమ ప్రత్యర్థులపై ఆది నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఈటల కాంగ్రెస్ అభ్యర్థి ఒడితల ప్రణవ్‌పై స్పష్టమైన ఆధిపత్యంతో గెలిచారు.
- పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మంథని- శ్రీధర్‌బాబు, రామగుండం- మక్కాన్ సింగ్, పెద్దపల్లి- విజయరమణారావు నియోజకవర్గాల్లో విజయం సాధించడంతో క్లీన్‌స్వీప్ చేసింది. మక్కాన్‌సింగ్ మూడోసారి పోటీ చేయడం, రామగుండంలో కాంగ్రెస్‌కు వచ్చిన అనూహ్య ఆదరణ, స్థానికంగా సానుభూతి పనిచేశాయి.
- సిరిసిల్లలో కేటీఆర్(బీఆర్ఎస్) సునాయస విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. తన చిరకాల ప్రత్యర్థి కేకే మహేందర్‌రెడ్డిని ఐదోసారి ఓడించారు. 2009 నుంచి వీరిద్దరూ పోటీ పడటం ఐదోసారి కావడం విశేషం. కాంగ్రెస్ హవా, సానుభూతి పనిచేయలేదు.
- వేములవాడలో ఊహించినట్లుగానే ఆది శ్రీనివాస్(కాంగ్రెస్) విజయం సాధించారు. ఆయన అసెంబ్లీకి పోటీ పడటం వరుసగా ఐదోసారి. గతంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రమేశ్ బాబు పౌరసత్వం విషయంలో న్యాయపరంగా పోరాడినా ఫలించలేదు. ఎట్టకేలకు ప్రజల దీవెనతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. వేములవాడ ఆలయ చైర్మన్‌గా పనిచేసిన వారు ఎమ్మెల్యేగా గెలవరంటూ దశాబ్దాలుగా సాగుతున్న సంప్రదాయానికి తెరదించారు. సమీప బీఆర్ఎస్ అభ్యర్థి చెలిమెడ లక్ష్మీనరసింహారావు, బీజేపీ అభ్యర్థి వికాస్‌రావులపై స్పష్టమైన మెజారిటీ సాధించారు.
- జగిత్యాలలో తొలుత జీవన్‌రెడ్డి పది రౌండ్ల వరకు ఆధిపత్యం కనిపించినా.. తర్వాత పుంజుకున్న సంజయ్ విజయం సాధించారు. కోరుట్లలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కె.సంజయ్ అనూహ్యంగా గెలిచారు. సమీప ప్రత్యర్థి ఎంపీ ధర్మపురి అరవింద్‌ను ఢీకొట్టగలరా? అన్న ప్రచారం జరిగింది. ఎగ్జిట్‌పోల్స్ కూడా అరవింద్‌కే మొగ్గుచూపాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు ఉన్న పేరు, అనుభవం సంజయ్ గెలుపులో కీలకపాత్ర పోషించాయి. ధర్మపురిలో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తన చిరకాల ప్రత్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై విజయం సాధించారు. 2009 నుంచి వీరిద్దరూ తలపడటం ఇది ఐదోసారి కావడం గమనార్హం. కాంగ్రెస్ హవా, లక్ష్మణ్‌పై సానుభూతి, అధికార పార్టీపై వ్యతిరేకత కలిసివచ్చాయి.

విశేషాలు..

- కరీంనగర్ నుంచి ఎంపీ బండి సంజయ్, కోరుట్ల నుంచి ఎంపీ అరవింద్ బీఆర్ఎస్ అభ్యర్థుల చేతిలో పరాజయం పాలయ్యారు. వీరిద్దరూ బీజేపీ అగ్రనేతలుగా వెలుగొంది, పార్టీ ఆదేశాలతో అసెంబ్లీ బరిలో దిగారు.
- హుజూరాబాద్ నుంచి పోటీచేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ విజయం సాధించగా, జగిత్యాల నుంచి పోటీ చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఓడిపోయారు.
- రాష్ట్రంలో వరుసగా ఏడుసార్లు గెలిచి సరికొత్త రికార్డు సృష్టించిన మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఎనిమిదోసారి పోటీలో ఓడారు. ఈసారి గెలిస్తే అత్యధికసార్లు శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేగా మరో కొత్త రికార్డు సృష్టించేవారు. ఆయన పోటీచేసిన హుజూరాబాద్, గజ్వేల్‌లో రెండుచోట్ల ఓటమి పాలయ్యారు.
- ఇప్పటి వరకు ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఐదుసార్లు గెలిచిన మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరో దఫా పోటీలో తొలిసారి ఓడిపోయారు. ఈయన గెలిచి ఉంటే ఈటల రాజేందర్ ఏడుసార్లు ఎమ్మెల్యే రికార్డు సమం అయ్యేది.



ఉమ్మడి జిల్లాలో ఫలితాలు ఇలా..

కరీంనగర్: గంగుల కమలాకర్ (బీఆర్ఎస్), ఓట్లు: 92,174, మెజారిటీ 3,169, రెండోస్థానం: బండి సంజయ్ కుమార్ (బీజేపీ), ఓట్లు: 89,005, మూడో స్థానం: పురమల్ల శ్రీనివాస్ (కాంగ్రెస్) ఓట్లు: 40,052

పెద్దపల్లి: విజయరమణరావు (కాంగ్రెస్), ఓట్లు: 1,18, 888, మెజారిటీ: 55,108, రెండో స్థానం: దాసరి మనోహర్‌రెడ్డి(బీఆర్ఎస్) ఓట్లు: 63,780, మూడో స్థానం:దాసరి ఉష (బీఎస్పీ), ఓట్లు 10,315

రామగుండం: రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ (కాంగ్రెస్) , ఓట్లు: 92,227 , మెజారిటీ: 56,794, రెండో స్థానం: కోరుకంటి చందర్ (బీఆర్ఎస్), ఓట్లు: 35,433, మూడో స్థానం: కందుల సంధ్యారాణి(బీజేపీ), ఓట్లు: 12,966

మంథని: దుద్దిళ్ల శ్రీధర్ బాబు (కాంగ్రెస్), ఓట్లు: 1,03,822 మెజారిటీ: 31,380, రెండో స్థానం: పుట్ట మధు (బీఆర్ఎస్), ఓట్లు: 72,442, మూడో స్థానం: సునీల్ రెడ్డి (బీజేపీ), ఓట్లు: 5,779

మానకొండూరు: సత్యనారాయణ (కాంగ్రెస్) పొందిన ఓట్లు: 96,773 మెజారిటీ : 32,365, రెండో స్థానం: రసమయి బాలకిషన్ (బీఆర్ఎస్), ఓట్లు: 64,408, మూడో స్థానం : ఆరెపల్లి మోహన్ (బీజేపీ) ఓట్లు: 14,879

చొప్పదండి: మేడిపల్లి సత్యం, పార్టీ: కాంగ్రెస్ ఓట్లు : 90,395, మెజారిటీ: 37,439, రెండో స్థానం: సుంకే రవిశంకర్ పార్టీ: (బీఆర్ఎస్) ఓట్లు : 52,956, మూడో స్థానం : బొడిగె శోభ గాలన్న, (బీజేపీ) ఓట్లు : 26,669

హుజూరాబాద్: పాడి కౌశిక్ రెడ్డి (బీఆర్ఎస్) ఓట్లు : 80,333 , మెజార్టీ: 16,873, రెండోస్థానం: ఈటల రాజేందర్ (బీజేపీ), ఓట్లు : 63,460, మూడో స్థానం : ఒడితల ప్రణవ్ (కాంగ్రెస్) ఓట్లు :53,164

హుస్నాబాద్: పొన్నం ప్రభాకర్ (కాంగ్రెస్), ఓట్లు: 1,00,955 , మెజార్టీ:19,344, రెండో స్థానం: ఒడితల సతీశ్ కుమార్, ఓట్లు: 81,611, మూడో స్థానం: బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఓట్లు: 8338

సిరిసిల్ల: తారక రామారావు, (బీఆర్ఎస్), ఓట్లు: 89,244, మెజారిటీ: 29,687, రెండో స్థానం: కేకే మహేందర్ రెడ్డి (కాంగ్రెస్), ఓట్లు: 59,557, మూడో స్థానం: రాణిరుద్ర మారెడ్డి(బీజేపీ) 18, 328

వేములవాడ: ఆది శ్రీనివాస్ (కాంగ్రెస్) ఓట్లు: 71451.మెజారిటీ: 14,581, రెండో స్థానం: చెలిమెడ లక్ష్మీనర్సింహారావు (బీఆర్ఎస్). ఓట్లు: 56,870, మూడో స్థానం: చెన్నమనేని వికాస్‌రావు (బీజేపీ), ఓట్లు: 29,710.

జగిత్యాల: సంజయ్‌కుమార్ (బీఆర్ఎస్), ఓట్లు: 70,243, మెజారిటీ: 15822, రెండో స్థానం : టి.జీవన్‌రెడ్డి (కాంగ్రెస్), ఓట్లు : 54,421, మూడోస్థానం : బోగ శ్రావణి (బీజేపీ), ఓట్లు : 42,138

కోరుట్ల: సంజయ్ (బీఆర్ఎస్), ఓట్లు : 72,115, మెజారిటీ: 10,305, రెండోస్థానం: ధర్మపురి అర్వింద్ (బీజేపీ), ఓట్లు : 61,810, మూడో స్థానం : జువ్వాడి నర్సింగారావు (కాంగ్రెస్), ఓట్లు : 39,647

ధర్మపురి: అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (కాంగ్రెస్), ఓట్లు: 91,393, మెజారిటీ: 22,039, రెండో స్థానం: కొప్పుల ఈశ్వర్ (బీఆర్ఎస్), ఓట్లు: 69,354, మూడో స్థానం : ఎస్.కుమార్ (బీజేపీ), ఓట్లు: 7,345

'ప్రజలే నా బలం బలగం'

- ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్



ధర్మపురి: ఎన్నికల్లో గెలిపించిన నియోజకవర్గ ప్రజలే తన బలం.. బలగమని, శ్వాస ఉన్నంత వరకూ ప్రజల వెంట ఉంటానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆయన గెలిచిన సందర్భంగా ధర్మపురిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నుంచి ప్రజలు ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. నాయకులు వేముల రాజేశ్, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, అరుణ, పద్మ, నాయకులు సుముక్, సింహరాజు ప్రసాద్, బలిపెల్లి లింగన్న, సీపతి సత్యనారాయణ, నాయకులు ఉన్నారు.

పోరాడి ఓడిన జీవన్‌రెడ్డి



కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ అభ్యర్థి, పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎన్నికల్లో పోరాడి ఓడారు. పదో రౌండ్ వరకు లీడ్‌లో నిలిచిన జీవన్‌రెడ్డి.. 11వ రౌండ్ నుంచి వెనుకబడ్డారు. చివరికి ఓటమి పాలయ్యారు. పోస్టల్ బ్యాలెట్‌లోనూ తన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. 11వ రౌండ్‌లో డాక్టర్ సంజయ్‌కుమార్ 945 ఓట్ల ఆధిక్యం సాధించి.. 19వ రౌండ్ వరకూ అలాగే కొనసాగించారు. చివరకు సంజయ్‌కుమార్‌కు 16071 ఓట్ల ఆధిక్యం రావడంతో జీవన్‌రెడ్డి ఓటమి పాలయ్యారు.

కోలాహలంగా ఎన్నికల కౌంటింగ్

జగిత్యాల/జగిత్యాలజోన్: జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు మల్యాల మండలం నూకపల్లి శివారులోని వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల వద్ద కోలాహలంగా సాగింది. ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకులతో పాటు, జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాషా, అడిషనల్ కలెక్టర్ లత ఎప్పటికప్పుడు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఆదివారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించారు. అయా పార్టీల ఏజెంట్లు, అధికారులు హాజరయ్యారు. తొలుత ప్రత్యేక టేబుళ్ల ద్వారా అధికారులు పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. అనంతరం రౌండ్ల వారీగా ఎన్నికల ఫలితాలను విడుదల చేశారు. జగిత్యాల 19, కోరుట్ల 19, ధర్మపురి 20 రౌండ్లు ఉండటంతో ఒక్కో రౌండ్ ఫలితం వచ్చే సరికి దాదాపు అరగంట పట్టింది. మధ్యాహ్నం భోజన సమయంలో కొద్దిసేపు విరామం ఇచ్చారు. భోజనం తర్వాత కొనసాగించారు. చివరకు రిటర్నింగ్ అధికారులు గెలుపొందిన అభ్యర్థులు ధృవీకరణ పత్రాలు అందించారు. కౌంటింగ్ కేంద్రంలో అడుగడుగునా బీఎస్ఎఫ్ పోలీస్ బలగాలతో నిఘాతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చిన అభ్యర్థుల్లో చాలామంది వెనుకంజలో ఉండటంతో రౌండ్ల మధ్యలోనే వారివారి ఇళ్లకు వెళ్లిపోవడం గమనార్హం.





మహిళలకు నో చాన్స్

- ప్రధాన పార్టీల నుంచి బరిలో ఐదుగురు
- అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం ఒక్కరికీ దక్కలేదు

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టి ×అధ్యక్షా౯ అని పిలవాలనుకున్న మహిళా ఎమ్మెల్యే అభ్యర్థులకు నిరాశే మిగిలింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14,96,023మంది మహిళా ఓటర్లు ఉండగా, బీజేపీ నలుగురికి, బీఎస్పీ ఒకరికి ఈ ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం కల్పించాయి. బీజేపీ రామగుండం అభ్యర్థిగా కందుల సంధ్యారాణి, సిరిసిల్ల నుంచి రాణిరుద్రమ, జగిత్యాల నుంచి భోగ శ్రావణి, చొప్పదండి నుంచి బోడిగె శోభ, పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థిగా దాసరి ఉష బరిలో నిలిచారు. వీరిలో భోగ శ్రావణి ప్రత్యర్థి పార్టీలకు ధీటుగా ఓట్లు సాధించగా, మిగిలిన అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి.

కోరుట్లలో కారు జోరు

- వరుసగా ఐదోసారి గెలుపు
- సంజయ్‌కి కలిసొచ్చిన సేవలు
- అర్వింద్‌కు తప్పని పరాభవం
- జువ్వాడికి హ్యాట్రిక్ ఓటమి..



ఎమ్మెల్యేగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల: కోరుట్లలో మరోసారి కారు జైత్రయాత్ర కొనసాగింది. కోరుట్ల కొత్త నియోజకవర్గం ఏర్పటైనప్పటి నుంచి నాలుగు సార్లు కారుకు పట్టం కట్టిన కోరుట్ల.. మరోసారి కారువైపే మొగ్గు చూపింది. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా కొనసాగిన కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు.. ఐదోసారి తన తనయుడు కల్వకుంట్ల సంజయ్‌ని బరిలో నిలిపి ఘన విజయం సాధించారు. నిజామాబాద్ ఎంపీ, బీజేపి అభ్యర్థి ధర్మపురి అర్వింద్ గట్టి పోటీ ఇచ్చినా పరాభవం మాత్రం తప్పలేదు. మూడోసారి బరిలోకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు మూడోస్థానంతో సరిపెట్టుకున్నారు.

ఆది నుంచే ఆధిపత్యం

కౌంటింగ్ మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ తన ఆధిపత్యం కొనసాగించారు. కోరుట్ల సెగ్మెంట్‌లోని ఇబ్రహీంపట్నం మండలంలో మొదటి మూడు రౌండ్లలో బీజేపీ అభ్యర్థి అర్వింద్‌పై 1,770 ఓట్ల ఆధిక్యం దక్కింది. 4, 5, 6, 7వ రౌండ్లలో మల్లాపూర్ మండలానికి చెందిన ఓట్ల లెక్కింపు కొనసాగగా.. సంజయ్ ఆధిపత్యం 6,177కు చేరింది. కోరుట్ల మండలంలోని గ్రామాలకు చెందిన 8, 9, 10 రౌండ్లలో 7,792 ఆధిక్యంలో నిలిచారు. అనంతరం కోరుట్ల పట్టణంలోని 11, 12, 13, 14వ రౌండ్లలో బీఆర్ఎస్, బీజేపీకి పోటాపోటీగా ఓట్లు వచ్చాయి. 14వ రౌండ్ ముగిసే సరికి బీఆర్ఎస్ 10,361 ఓట్ల మెజార్టీతో నిలిచింది. 15, 16, 17రౌండ్లలో మెట్‌పల్లి పట్టణంలో బీఆర్ఎస్, బీజేపీకి దాదాపు సమానంగా ఓట్లు వచ్చాయి. 17వ రౌండ్ ముగిసే సరికి బీఆర్ఎస్ ఆధిక్యం కొంత తగ్గి 9,974కు చేరింది. మెట్‌పల్లి రూరల్ మండలానికి చెందిన 18, 19 రౌండ్లలో మళ్లీ బీఆర్ఎస్ మెజార్టీ కొంత పెరిగి చివరికి 10,305 ఓట్ల మెజార్టీ వచ్చింది. మొత్తం 19 రౌండ్లు ముగిసేసరికి బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ 10,305 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారుల ప్రకటించారు. కరోనా కాలంలో కల్వకుంట్ల సంజయ్ సేవలు, వైద్యపరంగా అందించిన సాయం, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఐటీ హబ్‌ల ఏర్పాటు ప్రజలతో సత్సంబంధాలు వంటి అంశాలు కలిసొచ్చాయి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు సుమారు 84వేల ఓట్లు రాగా ఈసారి ఆయన తనయుడు కల్వకుంట్ల సంజయ్‌కు 71వేల ఓట్లు రావడం గమనార్హం.

అర్వింద్‌కు తప్పని పరాభవం

కోరుట్ల నియోజకవర్గం నుంచి గట్టి అంచనాలతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ధర్మపురి అర్వింద్ చివరికి ఓటమి పాలయ్యారు. ప్రతి రౌండ్‌లోనూ బీఆర్ఎస్‌కు గట్టి పోటీ ఇచ్చినా ఫలితం దక్కలేదు. నియోజకవర్గంలో సీనియర్ నాయకులు, క్యాడర్ కాస్త అసంతృప్తితో దూరంగా ఉండటం సమస్యగా మారినట్లు చర్చ జరుగుతోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో కోరుట్ల సెగ్మెంట్‌లో సుమారు 84 వేలు ఓట్లు సాధించిన ధర్మపురి అర్వింద్ ప్రస్తుత ఎన్నికల్లో 61,810 ఓట్లకే పరిమితం అయ్యారు.

జువ్వాడికి మూడో ఓటమి..

కాంగ్రెస్ అభ్యర్థికి మూడోసారి కోరుట్ల సెగ్మెంట్ ప్రజలు అండగా నిలవలేదు. ఫలితంగా జువ్వాడి నర్సింగరావు మరోసారి ఓటమి పాలయ్యారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జువ్వాడి నర్సింగరావు 53,385 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2014లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 38,305ఓట్లతో రెండో స్థానంలో, ఈసారి 39,323 ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు.

జగిత్యాలలో సంజయ్‌దే పైచేయి



సంజయ్‌కుమార్‌కు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారులు

జగిత్యాల/జగిత్యాలజోన్: జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్ రెండోసారి విజయం సాధించారు. నువ్వానేనా అన్నరీతిలో కొనసాగిన కౌంటింగ్‌లో చివరకు సంజయ్‌నే విజయం వరించింది. ఆయన గెలుపులో ప్రధానంగా జగిత్యాల పట్టణ ఓటర్లే ప్రభావం చూపారు. జిల్లాకేంద్రంలో బీజేపీ ఎక్కువ ఓట్లను చీల్చుతుందని భావించిన బీఆర్ఎస్.. ముందస్తుగానే వ్యూహం రచించి సఫలమైంది. వార్డులు, బూత్‌లవారీగా పోల్ మేనేజ్‌మెంట్‌ను పకడ్బందీగా అమలు చేసింది. దీంతో పట్టణ ఓటర్లు ఎక్కువగా ఉన్న జిల్లాకేంద్రంలో 11వ రౌండ్ నుంచి బీఆర్ఎస్ విజయదుందుభి మోగించింది. రౌండ్‌రౌండ్‌కూ ఆధిక్యం కనబరిచి చివరిరౌండ్ వరకూ అలాగే కొనసాగించి ఫలితం సాధించింది. పట్టణంలో మున్సిపల్ పాలకవర్గం, కౌన్సిలర్లు బీఆర్ఎస్ ఓట్లు చీలకుండా కాపాడుకోగలిగారు. ముఖ్యంగా మైనార్టీ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతారన్న సమాచారం మేరకు వారిని ప్రసన్నం చేసుకుని మైనార్టీ ఓటు బ్యాంకును సైతం బీఆర్ఎస్ రాబట్టుకున్నట్లు తెలుస్తోంది. పట్టణంలో బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి పద్మశాలీల ఓట్లను రాబట్టేందుకు ప్రయత్నిస్తూనే.. ఇతర వర్గాల ఓట్లు ఖాతాలో పడేలా చేసుకున్నారు.

ఎమ్మెల్యే స్వగ్రామంలో 1348 మెజార్టీ

జగిత్యాల ఎమ్మెల్యేగా రెండోసారి గెలిచిన సంజయ్ స్వగ్రామం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో భారీ మెజార్టీ సాధించారు. గ్రామంలో నాలుగు బూత్‌లలో 2,242 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా.. సంజయ్‌కుమార్‌కు 1645 ఓట్లు వచ్చాయి. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి 297, బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణికి 150 ఓట్లు వేశారు. సంజయ్‌కుమార్ 1348 మెజార్టీ అందించి తమ ప్రేమను చాటుకున్నారు.

ధర్మపురిలో ఎగిరిన కాంగ్రెస్ జెండా

- 22,039 మెజార్టీతో 'అడ్లూరి' విజయం
- ఐదోసారికి ఆదరించిన నియోజకవర్గ ప్రజలు
- ప్రతిరౌండ్‌లోనూ ఆధిక్యమే..
- మంత్రి కొప్పులకు తప్పని ఓటమి



అడ్లూరికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారులు

గొల్లపల్లి: ధర్మపురి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. ఆ పార్టీ అభ్యర్థిగా ఐదోసారి పోటీ చేసి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై 22,039 భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఇప్పటివరకు ధర్మపురి బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉండేది. దానిని అడ్లూరి బద్దలు కొట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని నమ్ముకున్న కొప్పులను కాదని ఇప్పటికే నాలుగు సార్లు ఓడిపోయాడన్న సానుభూతితో లక్ష్మణ్‌కుమార్‌కు పట్టంగట్టారు. ప్రతిరౌండ్‌లోనూ అడ్లూరి తన ఆధిక్యం చాటారు. మొత్తంగా 22,039 మెజార్టీ రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. బీజేపీతోపాటు మిగిలిన 12మంది అభ్యర్థుల డిపాజిట్ సైతం గల్లంతైంది.

కలిసొచ్చిన సానుభూతి

అవ్వలారా.. అక్కలారా.. అంటూ.. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను వేడుకున్నారు అడ్లూరి. నాలుగుసార్లు ఓడిపోయినా ప్రజల మధ్యనే ఉన్నానని, చంపుకుంటరో.. సాదుకుంటరో తేల్చుకోవాలంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఇలా నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ మాట్లాడుతూ ప్రజల్లో మంచి సానుభూతి పొందారు. ఆయన అభ్యర్థనను ప్రజలు అర్థం చేసుకోవడం.. కాంగ్రెస్ గాలి వీస్తుండడంతో అడ్లూరి విజయం సాధించగలిగారు.

బీఆర్ఎస్ కంచుకోటకు బీటలు

2009 పునర్విభజనలో భాగంగా ధర్మపురి నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి బీఆర్ఎస్ తరపున కొప్పుల, కాంగ్రెస్ నుంచి అడ్లూరి పోటీచేస్తూనే ఉన్నారు. 2009లో 1484 ఓట్ల తేడాతో.. 2010లో 58,891 ఓట్లు, 2014లో 18,679 ఓట్లు 2018లో 441 ఓట్ల స్వల్ప ఆధిక్యతతో కొప్పుల ఈశ్వర్ అడ్లూరిపై గెలిచారు. అప్పటినుంచి ధర్మపురి అంటేనే బీఆర్ఎస్‌కు కంచుకోటగా మారింది. నాలుగుసార్లు ఓడిపోయినా పట్టువదలని విక్రమార్కుడిలా అడ్లూరి పోరాడుతూనే ఉన్నారు. చివరకు ఈ ఎన్నికల్లో అదే కొప్పుల ఈశ్వర్‌ను ఓడించారు.

డిపాజిట్ కోల్పోయిన బీజేపీ..

ప్రధాన పార్టీ అయిన బీజేపీ అభ్యర్థి ఎస్.కుమార్ డిపాజిట్ కోల్పోయారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రచారం చేస్తూ.. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ముందుకెళ్లినా ఆయనను ఓటర్లు నమ్మలేదు. చివరకు 7,345 ఓట్లు సాధించి డిపాజిట్ కోల్పోయారు. నోటాకు 2,392 మంది జై కొట్టారు.

వీఆర్‌కే కాలేజీవద్ద కాంగ్రెస్ సంబురాలు..

ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై భారీ మెజార్టీతో విజయం సాధించడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

క్లుప్తంగా

చొప్పదండి ఎమ్మెల్యేగా సిరిసిల్ల జిల్లా వాసి

- ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన మేడిపల్లి సత్యం విజయం


మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్‌ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యేగా సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన మేడిపల్లి సత్యం విజయం సాధించారు. కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసిన సత్యం సుంకె రవిశంకర్‌పై 36,910 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మేడిపల్లి సత్యం 2014లో టీడీపీ అభ్యర్థిగా, 2018లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. రెండుసార్లు ఓడిపోయినప్పటికీ గత పదేళ్లుగా చొప్పదండి నియోజకవర్గంలో చురుకుగా కార్యకలాపాలు నిర్వహించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

తొలిసారి అసెంబ్లీకి నలుగురు ఎమ్మెల్యేలు

జగిత్యాల/జగిత్యాలజోన్‌: జిల్లాతో సంబంధం ఉన్న నాలుగు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టబోతున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తనయుడు డాక్టర్‌ సంజయ్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ తరఫున గెలుపొందారు. అలాగే ధర్మపురి ఎమ్మెల్యేగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ పొందారు. జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్‌ సంజయ్‌కుమార్‌ రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

గోవిందరావుపేట తండాలో దొంగతనం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని గోవిందరావుపేటతండాకు చెందిన లౌడ్యా తేజ్‌ కిరాణాషాపులో ఆదివారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. గోవిందరావుపేటకు వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై కిరాణాషాపు నిర్వహించుకుంటున్న తేజ్‌ శనివారం రాత్రి తాళం వేసి వెళ్లాడు. ఆదివారం ఉదయం చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో పరిశీలించారు. దుకాణంలో ఉన్న రూ.3,500 నగదు, రూ.1500 విలువైన సిగరెట్‌ ప్యాకెట్లు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయమై కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

పొరుగు జిల్లాల్లో కోరుట్లవాసుల ఓటమి

మెట్‌పల్లి: ఎన్నికల్లో పొరుగు జిల్లాల్లో బరిలో నిలిచిన కోరుట్ల నియోజకవర్గానికి చెందిన ముగ్గురు పరాజయం పాలయ్యారు. మెట్‌పల్లికి చెందిన బాల్క సుమన్‌ మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో, ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన జాన్సన్‌ నాయక్‌ మంచిర్యాల జిల్లా ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్‌ తరఫున పోటీచేసి ఓడిపోయారు. అలాగే మల్లాపూర్‌ మండలం మొగిలిపేటకు చెందిన శ్యామ్‌నాయక్‌ కొమురంభీంఆసిఫాబాద్‌ నుంచి కాంగ్రెస్‌ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. సుమన్‌ గతంలో ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేయగా.. శ్యామ్‌ నాయక్‌, జాన్సన్‌ నాయక్‌కు ఇవే తొలి ఎన్నికలు కావడం విశేషం

క్షుణ్ణంగా తనిఖీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు. మూడంచెల రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి కౌంటింగ్‌ కేంద్రాలకు వచ్చే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కౌంటింగ్‌ పాసులు, ఏజెంట్‌ పాసులు ఉన్నవారినే లోపలికి అనుమతించారు. సెల్‌ఫోన్లను లోపలికి అనుమతించకపోవడంతో కొందరు ఏజెంట్లు ఇబ్బందులుపడ్డారు. సెల్‌ఫోన్లను వేరే వాళ్లకి అప్పగించి ఆ తరువాత లోపలికి వెళ్లాల్సి వచ్చింది. పోలీసులు ఏర్పాటు చేసిన పటిష్టమైన భద్రతతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు.

గెలిచినా... ఓడినా ప్రజల్లోనే



జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్‌ సంజయ్‌కుమార్‌, ధర్మపురిలో అడ్లూరి లక్ష్మణ్‌, కోరుట్ల నుంచి డాక్టర్‌ కల్వకుంట్ల సంజయ్‌ గెలుపొందారు. కాగా గెలిచిన ఓడినా ప్రజల్లోనే ఉంటామని ప్రధాన పార్టీల అభ్యర్థులైన జీవన్‌రెడ్డి, భోగ శ్రావణితో పలువురు పోటీ చేసిన అభ్యర్థులు 'సాక్షి'కి తెలిపారు.

ప్రజల రుణం తీర్చుకోలేనిది



జగిత్యాల నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది. తనపై నమ్మకంతో రెండోసారి ఆశీర్వదించారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తా. నిత్యం ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల్లోనే ఉంటా.

– ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ (బీఆర్‌ఎస్‌ అభ్యర్థి)

ప్రజల్లోనే ఉంటా



ప్రజాతీర్పును గౌరవిస్తా. గెలిచినా, ఓడినా ప్రజల్లోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా. తన కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు.

– ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి (కాంగ్రెస్‌ అభ్యర్థి)

సేవ కోసమే



ఎన్నికల్లో గెలుపోటములు సహజం. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా. నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తాం. ప్రజల పక్షాన ఉంటూ నిత్యం సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా.

– భోగ శ్రావణి, బీజేపీ అభ్యర్థి

కోరుట్ల

ప్రజాసేవలో కొనసాగుతా



తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు. అన్నివర్గాలు నా గెలుపునకు సహకరించాయి. నాన్న చేసిన అభివృద్ధి పనులు, సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కోరుట్ల సెగ్మెంట్‌లో బలంగా పనిచేశాయి. నా గెలుపునకు సహకరించిన మంత్రి కేటీఆర్‌, ఎమ్మెల్సీ కవిత, కోరుట్ల సెగ్మెంట్‌లోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు రుణపడి ఉంటా. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తా. నియోజకర్గాన్ని మరింత గొప్పగా తీర్చిదిద్దుతా.

– కల్వకుంట్ల సంజయ్‌, బీఆర్‌ఎస్‌ కోరుట్ల ఎమ్మెల్యే

అందుబాటులో ఉంటా



నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నాం. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దు. మీ అందరికీ అందుబాటులో ఉండి కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలుచేసే అన్నిసంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషిచేస్తా. ఈ ఓటమి బాధ్యతను మరింత పెంచింది. రానున్న రోజుల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు కొనసాగిస్తా. గెలుపు కోసం కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు.

– జువ్వాడి నర్సింగరావు, కోరుట్ల కాంగ్రెస్‌ అభ్యర్థి

శిరసావహిస్తాం



ప్రజాతీర్పును శిరసావహిస్తాం. బీజేపీని ఆదరించి పెద్దఎత్తున ఓట్లువేసిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు. కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటర్లకు డబ్బులు పంచకుండా జీరో బడ్జెట్‌ పాలిటిక్స్‌కు కట్టుబడి ఉన్నాం. ఈ ఎన్నికల్లో స్వల్పతేడాతో తమ పార్టీ ఓడినా కొత్త రాజకీయాలకు శ్రీకారం చుట్టాం. ఎలాంటి ప్రలోభాలకు అవకాశం ఇవ్వకుండా పార్టీ గెలుపునకు కష్టపడి పనిచేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు.

– ధర్మపురి అర్వింద్‌, బీజేపీ కోరుట్ల అభ్యర్థి

ధర్మపురి

సమస్యలు పరిష్కరిస్తా



ధర్మపురి నియోజకవర్గ ప్రజలు నాకు మంచి అవకాశం ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తా. నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తా. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తా.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌, కాంగ్రెస్‌ అభ్యర్థి

తీర్పు గౌరవిస్తా



నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటా. నాకు నాలుగు సార్లు అవకాశం ఇవ్వగా నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశా. ఓడినా, గెలిచినా ప్రజల్లోనే ఉంటూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా.

– కొప్పుల ఈశ్వర్‌, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి

బీఆర్‌ఎస్‌ శ్రేణుల సంబరాలు


గోధూర్‌లో సంబురాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

కోరుట్ల: కోరుట్ల ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్‌ అభ్యర్థి డాక్టర్‌ సంజయ్‌ గెలుపొందడం పట్ల బీఆర్‌ఎస్‌ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. డాక్టర్‌ సంజయ్‌ ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారి కోరుట్లకు వస్తున్న సందర్భంగా మోహన్‌రావుపేట శివారులో బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పట్టణంతో పాటు మండలంలోని మోహన్‌రావుపేట, ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌లో బీఆర్‌ఎస్‌ నాయకులు పటాకులు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. కోరుట్ల సాయిబాబా ఆలయంలో డాక్టర్‌ సంజయ్‌ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీలు తోట నారాయణ, జాజాల భీమేశ్వరి, బీఆర్‌ఎస్‌ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్‌, దారిశెట్టి రాజేశ్‌, రైబస జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచులు సరికెల్ల మల్లా రెడ్డి, సోమ ప్రభాకర్‌, బీఆరెస్‌ నాయకులు పాల్గొన్నారు.

కోరుట్లలో..

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో బీఆర్‌ఎస్‌, బీజేపీ, కాంగ్రెస్‌ నాయకులు ఎవరికి వారు సంబురాలు జరిపారు. కోరుట్ల ఎమ్మెల్యేగా కల్వకుంట్ల సంజయ్‌ గెలిచినందుకు బీఆర్‌ఎస్‌ నాయకులు, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినందుకు కాంగ్రెస్‌ నాయకులు, చత్తీస్‌గఢ్‌, మధ్యప్రదేశ్‌ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చినందుకు బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకోవడం గమనార్హం.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్‌: కోరుట్ల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి డాక్టర్‌ కల్వకుంట్ల సంజయ్‌కుమార్‌ గెలుపొందడం పట్ల మండలకేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సంబరాలు జరుపుకున్నారు. పార్టీ జెండాలతో బైక్‌ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌ రెడ్డి, వైస్‌ ఎంపీపీ గౌరు నాగేశ్‌, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు నల్ల రాజన్న, బద్దం విజయ, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్‌, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డితో పాటు బీఆర్‌ఎస్‌ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామశాఖ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోరుట్ల: సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌


కోరుట్లలో బీఆర్‌ఎస్‌ సంబరాలు


పాతదాంరాజుపల్లిలో సంబరాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్‌ నాయకులు


ఎమ్మెల్యే సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు


ఎమ్మెల్యేకు తిలకం దిద్దుతున్న మహిళ

మహిళలకు నో చాన్స్‌

- ప్రధాన పార్టీల నుంచి బరిలో ఐదుగురు
- అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశంఒక్కరికీ దక్కలేదు

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా నుంచి ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టి 'అధ్యక్షా' అని పిలవాలనుకున్న మహిళా ఎమ్మెల్యే అభ్యర్థులకు నిరాశే మిగిలింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14,96,023 మంది మహిళా ఓటర్లు ఉండగా, బీజేపీ నలుగురికి, బీఎస్పీ ఒకరికి ఈ ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం కల్పించాయి. బీజేపీ రామగుండం అభ్యర్థిగా కందుల సంధ్యారాణి, సిరిసిల్ల నుంచి రాణిరుద్రమ, జగిత్యాల నుంచి భోగ శ్రావణి, చొప్పదండి నుంచి బోడిగె శోభ, పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థిగా దాసరి ఉష బరిలో నిలిచారు. వీరిలో భోగ శ్రావణి ప్రత్యర్థి పార్టీలకు దీటుగా ఓట్లు సాధించగా, మిగిలిన అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి.

హోరాహోరీగా కౌంటింగ్‌

జగిత్యాల/జగిత్యాలజోన్‌: జగిత్యాల నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులుగా జీవన్‌రెడ్డి, సంజయ్‌కుమార్‌, భోగ శ్రావణి పోటీపడ్డారు. నెల రోజులుగా ప్రచారం చేస్తూ ప్రజలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేసినా ప్రజలు బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సంజయ్‌కుమార్‌ వైపు మొగ్గుచూపి గెలుపునకు సహకరించారు.

ప్రధాన పార్టీల అభ్యర్థుల ఓట్లు రౌండ్లవారీగా

రౌండ్‌	బీఆర్‌ఎస్‌	కాంగ్రెస్‌	బీజేపీ	మెజార్టీ
1	2264	3253	1580	– 989
2	3270	3820	3021	– 550
3	3460	3077	3617	383
4	3173	2618	2516	555
5	2462	3323	1271	– 861
6	3012	3450	1900	– 438
7	3282	3447	1838	– 165
8	3942	3600	1788	342
9	3462	3016	1780	446
10	3984	3624	1917	360
11	4146	2040	2566	2106
12	3767	1622	3432	2145
13	4044	1627	3317	2417
14	4748	2352	2683	2396
15	5317	3032	1723	2285
16	4764	3132	2102	1632
17	4886	2856	1961	2030
18	4715	2980	1847	1735
19	1545	1552	1279	– 7
మొత్తం	70,243	54,421	42,138	15,822

ధర్మపురి నియోజకవర్గ ప్రధాన పార్టీల అభ్యర్థుల ఓట్లు రౌండ్ల వారీగా..

రౌండ్‌	కాంగ్రెస్‌	బీఆర్‌ఎస్‌	బీజేపీ	మెజార్టీ
1	3,916	3487	369	429
2	4,889	3249	415	1439
3	5,701	3471	530	2230
4	3,864	3160	467	704
5	4,768	3742	376	1026
6	4,840	3504	344	1336
7	4,855	4351	224	504
8	4,802	3510	252	1292
9	5,024	3355	255	1669
10	4697	3526	328	1171
11	5187	3119	238	2068
12	5335	4075	334	1260
13	4788	3345	324	1443
14	4977	4237	426	740
15	4261	4010	583	251
16	4386	4048	365	338
17	4675	3399	370	1296
18	4168	3352	580	816
19	5044	3312	396	1732
20	715	747	58	-32

రాయికల్‌లో జీవన్‌రెడ్డికి స్వల్ప ఆధిక్యం



- నాలుగు రౌండ్లలో కాంగ్రెస్‌ ముందంజ
- మూడవ రౌండ్‌లో బీజేపీ
- పెరిగిన బీజేపీ ఓటింగ్‌ శాతం

రాయికల్‌: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఐదు రౌండ్లలో మండలంలో మొత్తం 601 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్‌ ఆధిక్యంలో ఉండగా బీఆర్‌ఎస్‌, బీజేపీ, కాంగ్రెస్‌, పార్టీల అభ్యర్థులు నువ్వా నేనా అన్నట్లుగా పోటీపడ్డారు. మొదటి రౌండ్‌లో బోర్నపల్లి, దావన్‌పల్లి, కట్కాపూర్‌, తాట్లవాయి, కైరిగూడెం, వస్తాపూర్‌, చింతలూరు, మూటపల్లి, కొత్తపేటలో కాంగ్రెస్‌ లీడ్‌. రెండోరౌండ్‌లో మంక్యానాయక్‌తండా, ఒడ్డెలింగాపూర్‌, ధర్మాజీపేట, ఆలూరు, రాజనగర్‌, వీరాపూర్‌,భూపతిపూర్‌ రామాజీపేట, రాయికల్‌లో కాంగ్రెస్‌కు లీడ్‌ కొనసాగగా మూడో రౌండ్‌లో రాయికల్‌, చెర్లకొండాపూర్‌, ఇటిక్యాలలో బీజేపీ లీడ్‌, నాలుగో రౌండ్‌లో రామారావు పల్లె, మైతాపూర్‌, కుమ్మరిపెల్లి, ఉపుమడుగు, అల్లీపూర్‌, సింగరావుపేట, శ్రీరాంనగర్‌లో కాంగ్రెస్‌, ఐదో రౌండ్‌లో అయోధ్య, కిష్టంపేట గ్రామాల్లో కాంగ్రెస్‌ లీడ్‌ కొనసాగింది. గత ఎన్నికల్లో మండల ఓటర్లపైనే ఆధారపడిన అభ్యర్థులు ఈసారి మాత్రం అన్ని పార్టీల నాయకుల ఓట్లు చీలడంతో కేవలం కాంగ్రెస్‌ పార్టీకి ఐదురౌండ్లలో 601 ఓట్ల మెజార్టీ రాగా బీజేపీ, బీఆర్‌ఎస్‌ అభ్యర్థుల ఆశలు నిరాశలయ్యాయి. గతంలోకంటే బీజేపీలో ఓటింగ్‌ శాతం పెరిగింది.

పోస్టల్‌ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కే ఆధిక్యం

జగిత్యాల/జగిత్యాల జోన్‌: నియోజకవర్గ పోస్టల్‌ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌ పార్టీకే ప్రజలు ఎక్కువగా ఓటువేశారు. నియోజకవర్గంలో 1994 ఓట్లకుగాను, కాంగ్రెస్‌ అభ్యర్థి జీవన్‌రెడ్డికి 724 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణికి 607 ఓట్లు రాగా బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సంజయ్‌కుమార్‌కు 480 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి మల్లేశం యాదవ్‌కు 16 ఓట్లు రాగా మన తెలంగాణ రాష్ట్ర సమితి అభ్యర్థి అంకం శ్రీనివాస్‌కు 4 ఓట్లు పడ్డాయి. ధర్మ సమాజ్‌ పార్టీ అభ్యర్థి దుబ్బ చైతన్య కుమార్‌కు 4 ఓట్లు వచ్చాయి. నోటాకు 11 ఓట్లురాగా పిరమిడ్‌ పార్టీ అభ్యర్థి సత్యనారాయణ మూర్తికి 4 ఓట్లు పడ్డాయి. మిగతా 8 మంది ఇండిపెండెంట్‌ అభ్యర్థులకు 3–4 చొప్పున ఓట్లు వచ్చాయి. అయితే, పోస్టల్‌ బ్యాలెట్‌లో 119 ఓట్లు తిరస్కరించడం గమనార్హం.



కాంగ్రెస్‌ నాయకుల సంబరాలు



గొల్లపల్లి : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌ గెలుపొందారు. అడ్లూరి గెలుపుతో ఆదివారం కాంగ్రెస్‌ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.